క్లుప్తంగా

చెస్ శిక్షణ ప్రారంభం



ఉచిత చెస్ శిక్షణా శిబిరం ప్రారంభించిన దృశ్యం

భీమవరం: చదరంగంలో శిక్షణ ద్వారా మేధా శక్తిని పెంపొందించుకుని విద్యలో ఉన్నతంగా రాణించవచ్చునని చెస్ ఇంటర్నేషనల్ గ్రాండ్ మాస్టర్ పీడీఎస్ గిరినాథ్ అన్నారు. అనసూయ చెస్ అకాడమీ, జిల్లా చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం విశ్వకవి స్కూల్లో ఉచిత చదరంగం శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు పిల్లల ఆసక్తి మేరకు తల్లిదండ్రులు వివిధ రంగాల్లో శిక్షణ ఇప్పించడం ద్వారా ఉన్నత స్థాయిలో రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చదరంగం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్, ఉపాధ్యక్షుడు తోట హరిబాబు, సంయుక్త కార్యదర్శి మైలాపురి మురళి, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి లారీల సీజ్



కోలమూరులో సీజ్ చేసిన లారీతో వీఆర్వో అప్పలాచార్యులు

ఉండి: కోలమూరులో అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న మూడు టిప్పర్ లారీలను, పొక్లెయిన్, బుల్డోజర్‌ను వీఆర్వో అప్పలాచార్యులు పట్టుకుని సీజ్ చేశారు. మట్టి రవాణాతో సీసీ రోడ్లపై మట్టిపెళ్లలు పడటంతో వాహనదారులు జారి పడి గాయాలపాలవుతున్నారని, పంచాయతీ సీసీ రోడ్లు ధ్వంసం అవుతున్నాయని స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో వీఆర్వో తహసీల్దార్ కె.శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేసినట్టు వీఆర్వో చెప్పారు.

అంతరిస్తున్న కళలను ఆదరించాలి



రంగస్థల కళాకారులను సత్కరిస్తున్న కావలి శ్రీనివాసరావు

పాలకొల్లు అర్బన్: అంతరించిపోతున్న కళారంగాన్ని బతికించుకోవడానికి దాతలు ముందుకు రావాలని శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ కావలి శ్రీనివాసరావు అన్నారు. పాలకొల్లు యడ్లబజారులో వేంచేసియున్న శ్రీకనకదుర్గమ్మ కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి షిరిడిసాయి నాట్యమండలి, నరసాపురం వారి ఆధ్వర్యంలో 'చిల్లరకొట్టు చిట్టెమ్మ' సాంఘిక నాటకం ప్రదర్శించారు. ఈ నాటకంలోని పాత్రధారులు మానాపురం సత్యనారాయణ, శాంతారావును ట్రస్ట్‌బోర్డు చైర్మన్ శ్రీనివాసరావు శాలువాతో సత్కరించి అభినందించారు. శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ జోగి వెంకటేశ్వరరావు, ట్రస్టీ తాతపూడి శ్రీరాములు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉనికెల శ్రీనివాస్, జోగాడ ఉమామహేశ్వరరావు, కొండేటి రవి, గుండుబోయిన నాగేశ్వరరావు, భాగవతం తిరుమల ఆచార్యులు, ఆలయ సిబ్బంది రాంబాబు, మంగతాయారు తదితరులు కళాకారులను అభినందించారు.

శ్రీ ఉమా వైద్యనాథేశ్వర స్వామికి గ్రామోత్సవం



పెనుమర్రులో స్వామివారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: పెనుమర్రులోని శ్రీ ఉమా వైద్యనాథేశ్వరస్వామికి జరుగుతున్న కల్యాణోత్సవాలలో భాగంగా సోమవారం దేవేరులకు త్రిశూల స్నానం, వసంతోత్సవం, పుష్పోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు బాదంపూడి వరప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం గ్రామ బలిహరణ కార్యక్రమంలో భాగంగా శ్రీ ఉమా సహిత వైద్యనాథేశ్వరస్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవాలు మంగళవారం రాత్రి నిర్వహించే అఖండ అన్నసమారాధనతో ముగుస్తాయని ఆలయ నిర్మాత పాత్తూరి సోమరాజు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.సతీష్‌కుమార్ చెప్పారు.

అన్నసమారాధన

మొగల్తూరు: శివరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక పురాతన పార్వతీ విశ్వేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేద్దాం



ఆకివీడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి



ఉప్పులూరులో ప్రచారం చేస్తున్న పీవీఎల్ గోపాలకృష్ణంరాజు

- వైఎస్సార్ సీపీ ఉండి నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి
- ఆకివీడులో ఎన్నికల ప్రచారం

ఆకివీడు: వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసే బాధ్యత మీదేనని నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. పట్టణంలోని 1, 13, 14, 16 వార్డుల్లో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా పలువురు ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. పేద ప్రజల ఆర్థిక స్థితిగతులు మార్చిన జగన్ పరిపాలనను చూశారని, రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందాలన్నా, ప్రజల సంక్షేమం పెరగాలన్నా మళ్లీ జగనే సీఎంగా రావాలన్నారు. సంక్షేమ పథకాలతో పేదల ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతున్నాయని, సొంత ఇంటి కల నెరవేరిందని శ్రీలక్ష్మి చెప్పారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా జగన్ పరిపాలన కొనసాగిందన్నారు. చంద్రబాబు హయాంలో ప్రజలు పడిన కష్టాల్ని గుర్తు చేసుకోవాలన్నారు. మళ్ళీ కష్టాల్ని కొనితెచ్చుకోవద్దని ఆమె సూచించారు. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి ఉండి నియోజకవర్గ అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజును, ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమా బాలను గెలిపించాలన్నారు. ఎన్నికల ప్రచారంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్‌బీబీ, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ జగ్గరోతు విజయ్‌కుమార్, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, మన్నే పోతరాజు, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు అంబటి రమేష్, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, కౌన్సిలర్లు నిమ్మల నాగు, దొడ్డి జగదీష్, మోటుపల్లి కుమారి, మాధవి, గుండుగొలను సావిత్రి, ఊడిగ శ్రీనివాస్, ఎస్కే. హుస్సేన్, బండారు వెంకటరత్నం నాయుడు పాల్గొన్నారు.

సంక్షేమం కొనసాగాలంటే జగన్ గెలవాలి

ఉండి: గడచిన ఐదేళ్లలో రాష్ట్ర ప్రజలంతా సంక్షేమ పథకాల అమలుతో ఎంతో సంతోషంగా జీవించారని ఉండి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు సోదరుడు గోపాలకృష్ణంరాజు అన్నారు. సోమవారం ఉప్పులూరులో పీవీఎల్ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నికల్లో గెలవాలంటే మాయమాటలు, మోసపూరిత వాగ్దానాలు చేసేవారని, కానీ ఇప్పుడు చేసిందే చెప్పి మీకు మంచి జరిగితేనే ఓటు వేయండి అని చెప్పేంత గొప్ప నాయకులను ఇప్పుడు మనం చూస్తున్నామన్నారు. దేశంలో ఇలా చెప్పి ఓట్లు అడిగే దమ్ము, ధైర్యం మరెవ్వరికీ లేవన్నారు. ప్రజలను మంచి చేశారు కనుకనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధైర్యంగా ఓట్లు అడుగుతున్నారని అన్నారు. జగన్ పాలనలో ప్రజలకు చేసిన మంచి మరెవ్వరూ చేయలేదని, దీనికి ప్రజలే సాక్షులన్నారు. అందుకే వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డినే గెలిపించుకుని సంతోషంగా జీవించాలని ప్రజలు నిర్ణయించుకున్నారని అన్నారు. ఇక వైఎస్సార్ సీపీ గెలుపును ఎవ్వరూ ఆపలేరన్నారు. ఉండిలోనూ వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని గోపాలకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నిమ్మల కేశవకుమార్(బాలు), కుంచాడ వెంకటేశ్వరరావు, యండగండి సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి, జీ సుందర్‌కుమార్, దేవస్థానం చైర్మన్ యర్రా సుబ్బారావు, ఏఎంసీ డైరెక్టర్ నిమ్మల బాబ్జి పాల్గొన్నారు.

ఘనంగా ఆలయాల్లో చండీ హోమాలు



మావుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణంలోని శ్రీమావుళ్లమ్మవారి ఆలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి చండీహోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు సంప్రదాయబద్ధంగా చండీహోమం నిర్వహించగా 75 మంది దంపతులు హోమంలో పాల్గొన్నారు. అలాగే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి, నగేష్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

పంచారామక్షేత్రంలో..

పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని పంచారామక్షేత్రంలో శ్రీఉమాసోమేశ్వర స్వామి వారికి పౌర్ణమి పూజలు నిర్వహించారు. అలాగే స్వామి వారికి ప్రత్యేక పుష్పాలంకరణ, దీపాలంకరణ పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.రామకృష్ణంరాజు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

అలాగే జువ్వపాలెం రోడ్డులోని శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో వేంచేసియున్న శ్రీపద్మావతి అమ్మవారికి ఫాల్గుణ మాసం ఉత్తర నక్షత్ర పురస్కరించుకుని ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి రుద్రరాజు గంగాశ్రీదేవి, దేవస్థానం చైర్మన్ మంతెన రామ్‌కుమార్‌రాజు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

బొండాడలో మహా చండీ హోమం

కాళ్ల: బొండాడలో వేంచేసియున్న పోలేరమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయం వద్ద సోమవారం మహా చండీహోమం వేదమంత్రాల నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవార్ల జాతర మహోత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆలయం వద్ద ప్రధాన అర్చకులు వేద మంత్రాల నడుమ మహా చండీహోమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మన్నే వరలక్ష్మి నాగరాజు దంపతులు, భక్తులతో వేద పండితుల సమక్షంలో హోమం నిర్వహించారు. దీనితో గ్రామం అంతా ఆధ్యాత్మిక చింతనతో నిండిపోయింది. అమ్మవార్లని ఉండి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, గాదిరాజు సుబ్బరాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేద పండితుల నుంచి ఆశీర్వచనాలు పొంది అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు రాజకీయ ప్రముఖులను దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నే నాగరాజు, గోళ్ల పండు, మన్నే శ్రీనివాసరావు, కందుల హనుమ, పెనుమత్స రంగరాజు, మందపాటి రవి, మన్నే సోమేశ్వరరావు, కట్ట సుబ్బయ్య, మేక వెంకన్న బాబు, కట్ట వెంకటరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



బొండాడలో మహా చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం



ఆలయం వద్ద పీవీఎల్, శ్రీనివాసరాజును ఆశీర్వదిస్తున్న అర్చకులు



ప్రత్యేక దీపాలంకరణలో ఉమాసోమేశ్వర స్వామి

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై దృష్టి



పోలింగ్ బూత్‌ను తనిఖీ చేస్తున్న జేసీ ప్రవీణ్ ఆదిత్య

కాళ్ల: మండల పరిధిలో పోలింగ్ బూత్‌లను జేసీ, ఉండి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీవీ ప్రవీణ్ ఆదిత్య సోమవారం తనిఖీ చేశారు. పెదమిరంలో–5, కోపల్లెలో–4, వేంపాడులో–2తో కలిపి మొత్తం 11 పోలింగ్ బూత్‌లను జేసీ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్‌లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, తదితర సౌకర్యాల కల్పనపై సెక్టోరల్, నోడల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మండల పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో శాంతియుతంగా ఎక్కువ శాతం పోలింగ్ జరిగేలా 'స్వీప్ ' ద్వారా అవగాహనా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెక్టారోల్ అధికారి పంచాయతీరాజ్ ఏఈ రమేష్, సర్వేయర్లు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

నేడు చింతపర్రులో గుడాల గోపి ప్రచారం

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) చింతపర్రులో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ప్రచారం నిర్వహిస్తారని పార్టీ మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు, ఆ గ్రామ సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రచారంలో పాల్గొనాలని వారు కోరారు.

ఘనంగా విగ్రహాల ఊరేగింపు

మొగల్తూరు: మొగల్తూరులోని రామాలయం వీధిలో నూతనంగా నిర్మించిన దత్తసాయి మందిరంలో ఈనెల 28న జరిగే విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్వామివార్ల విగ్రహాలను ఘనంగా ఊరేగించారు. మైసూరు దత్తపీఠాధిపతి శ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి వారు ప్రసాదించిన దత్త సాయి (శోడచోపచారమూర్తి), శిరిడి సాయి (అలంకారమూర్తి), సాయి పాదుకలు, జంట నాగేంద్రస్వామి, శ్రీ సప్త శిరో విరాజిత ఫణీంద్ర స్వామి విగ్రహాలను మంచిలి దుర్గాప్రసాద్ శర్మ, వేలవల పల్లి చంద్రశేఖర్ శర్మ, శెట్టిమోహన్‌రావు ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

మొగల్తూరు: మండలంలో ఉపాధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీనిలో భాగంగా శేరేపాలెం, పాలకమ్మచెరువు, కేపీ పాలెం నార్త్, సౌత్, పేరుపాలెం నార్త్, సౌత్, మొగల్తూరు పంచాయతీలోని కొత్తకాయలతిప్ప, నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం తదితర ప్రాంతాలలో పంటబోదెల పనులు నిర్వహిస్తున్నారు. సోమవారం కేపీ పాలెం నార్త్‌లోని రాజుగారి ఒడ్డు ప్రాంతం నుంచి బ్యాంక్ రోడ్డు వరకు శివారు ప్రాంతంలోని ప్రతి ఎకరాకు నీరందేలా పంట బోదెల్లో పూడిక తొలగింపు, గుర్రపుడెక్క తొలగించే పనులు సాగుతున్నాయి.

● ప్రచారం జోరు



ఉండిలో ప్రచారం నిర్వహిస్తున్న పీవీఎల్ నర్సింహరాజు

ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు ఎన్నికల ప్రచారం జోరు పెంచారు. ఆయన ప్రచారానికి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి తమ మద్దతును తెలుపుతున్నారు. ఉండిలో సోమవారం నిర్వహించిన ప్రచారం సందర్భంగా పలువురు మహిళలు పీవీఎల్‌కు హారతులు పట్టి స్వాగతం పలికారు. జగన ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరిగిందని ఈ సందర్భంగా పీవీఎల్ అన్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు. – ఉండి

ప్రకృతి వ్యవసాయం.. రైతులకు లాభదాయకం



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వీరవాసరం: ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చుని, కావున రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా కోఆర్డినేటర్ అరుణ కుమారి అన్నారు. వీరవాసరం మండలం నందమూరి గరువు గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద సోమవారం నిర్వహించిన డివిజన్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. నీమాస్త్రం తయారు చేయడానికి 10 లీటర్ల ఆవు మూత్రం, రెండు కేజీల ఆవు పేడ, వేపాకులు 10 కేజీలు తీసుకుని ముద్ద చేయాలన్నారు. ముందుగా 100 లీటర్ల డ్రమ్ములోకి నీరు తీసుకుని వేపాకుల ముద్ద, ఆవు మూత్రం, ఆవు పేడ వేసి బాగా కలపాలన్నారు. 48 గంటలు ఉంచిన తర్వాత పల్చటి గుడ్డతో వడగట్టిన తర్వాత నీమాస్త్రం తయారవుతుందన్నారు. వరి చేనుపై ఒక ఎకరానికి 100 లీటర్ల నీమాస్త్రం, 100 లీటర్ల నీరు కలిపి పిచికారి చేసినట్లయితే రసం పీల్చే పురుగులను, గొంగళి పురుగులు, అన్ని రకాల పురుగుల గుడ్లను, తెగుళ్లను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి స్వామి, ఎంటీ రమేష్, మండల ఇన్‌చార్జిలు శివకృష్ణ, రవికుమార్, నాగరాజు, దుర్గారావు, వీరేంద్ర, ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దుష్ప్రచారం తగదు

పెనుగొండ: వైఎస్సార్ సీపీ కార్యకర్తలను బెదిరించి బలవంతంగా టీడీపీలోకి లాక్కునే ప్రయత్నం చేస్తూ, పార్టీ కండువాలు కప్పి దుష్ప్రచారం చేస్తున్నారని దళిత సంఘాల నాయకులు విమర్శించారు. పెనుగొండ మండలం ములపర్రులో దళిత సంఘాలు నాయకులు సోమవారం సమావేశం నిర్వహించారు. టీడీపీ అభ్యర్థి పితాని సత్యనారాయణ ఇంటింటికీ ప్రచారంలో భాగంగా బలవంతంగా పార్టీ కండువా కప్పి, అనుమతి లేకుండానే ఎల్లో మీడియాలో తమ పేర్లను ప్రకటించి తమ మనోభావాలను దెబ్బతీసేలా వ్యవరిస్తున్నారని మండిపడ్డారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జగనన్న కాలనీ, అమ్మఒడి వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమం అందించి అండగా నిలిచారన్నారు. ఆచంటలో గతంలో పదిహేను ఏళ్లుగా ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన పితాని ఏనాడు తమ వైపు కన్నెత్తి చూడలేదని, జన్మభూమి కమిటీల పేరుతో ప్రతి గ్రామాన్ని దోచుకున్నారని ధ్వజమెత్తారు. పేదలకు ఇళ్ల స్థలాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మాత్రమే ఇవ్వడం జరిగిందన్నారు. స్థానిక శాసనసభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించి గ్రామానికి కొత్తదనం తీసుకువచ్చారన్నారు. ఇటువంటి వ్యక్తిని తిరిగి మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే ప్రతి గ్రామం కూడా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. తాము ఎల్లవేళలా ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు వెంటే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు కలగట సాగర్, నల్లిమిల్లి రాజబాబు, కర్తాకుల సుబ్రహ్మణ్యం, యాండ్ర శ్రీను, కుసుమే రామారావు, రొక్కాల వినోద్, గోశాల త్రిమూర్తులు, రొక్కాల భీమా, కత్తుల వినోద్, కటిదెల రమేష్, కుసుమే చక్రవర్తి, పీతల రాంబాబు, కోటి దుర్గారావు, ముఖేష్ పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో హోలీ వేడుకలు

భీమవరం: భీమవరం పట్టణం, పరిసర ప్రాంతాల్లో సోమవారం హోలీ పండుగను వివిధ వర్గాల ప్రజలు ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. వివిధ విద్యాసంస్థల విద్యార్థులు రంగులు చల్లుకుంటూ కేరింతలతో ఉత్సాహంగా గడిపారు. యువత ఒకరిపై మరొకరు రంగులు జల్లుకున్నారు. పట్టణ మార్వాడి సమాజ్ ఆధ్వర్యంలో యువత, పెద్దలు రాజస్తానీ సంప్రదాయ డప్పు వాయిద్యాలతో కర్ర విన్యాసాలుచేస్తూ రంగులు చల్లుకుంటూ సంప్రదాయబద్ధంగా హోలీ వేడుకలు నిర్వహించుకున్నారు.

ఉత్సాహంగా హోలీ

భీమవరం అర్బన్: మండలంలోని హోలీ పర్వదినాన్ని మార్వాడి సమాజ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. చినఅమిరంలో విజ్ఞాన భారతి హైస్కూల్ ప్రాంగణంలో సంప్రదాయమైన వస్త్రాలంకరణలో యువతీ యువకులు, మహిళలు కర్ర విన్యాసాలు చేస్తూ రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహం మధ్య హోలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధర్మంపై ధర్మం గెలిచిన రోజుగా హోలీ పండుగను నిర్వహిస్తారన్నారు. ఈ హోలీ పండుగ ఉత్తరాది రాష్ట్రాలకే ప్రాంతాలకే పరిమితం కాకుండా మన ప్రాంతానికి విస్తరించడం చాలా సంతోషకరమన్నారు. జి.త్రిలోక్ ఈశ్వర్ సింగ్, గేవర్చంద్ పాల్గొన్నారు

కారు అద్దం ధ్వంసం

పాలకొల్లు సెంట్రల్: తన కారు అద్దాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని బీజేపీ నాయకులు రావూరి సుధ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 22న రాత్రి స్థానిక 15వ వార్డులోని నివాస ప్రాంతంలో కారు పార్కు చేయగా, 23న ఉదయం చూసేసరికి కారు వెనుక అద్దం పగిలిపోయి ఉందన్నారు. ఘటనపై కేసు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.